సూర్య
నేటి దినపత్రిక
17 వ వసంతంలోకి
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
సోమవారం | 22 జులై 2024 | పేజీలు 8

## నామినేటెడ్ పదవుల్లో లీగల్ సెల్‌కు

# మొదటి ప్రాధాన్యత

5లో

## గురుపూర్ణిమ వేడుకలో సీఎం



కావలి, మేజర్‌న్యూస్ : మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ లో ఆదివారం జరిగిన గురుపూర్ణిమ మహోత్సవ వేడుకల్లో సీఎం చంద్రబాబు నాయుడుతో పాటు కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాల్ని నిర్వహించారు. అనంతరం రామదూతని ఘనంగా సత్కరించారు. స్వామి ఆశీర్వాదాలు అందుకున్నారు. కార్యక్రమంలో కావలి ఆర్యవైశ్య పట్టణ అధ్యక్షులు తట్టపర్తి రమేష్ కూడా ఉన్నారు.

## మహిమలూరులో గురుపూర్ణిమ ఉత్సవాలు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని మహిమలూరులోని శ్రీ షిరిడి సాయినాధుని ఆలయంలో ఆదివారం గురుపూర్ణిమ సందర్భంగా బెస్త సంఘీయులు ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. జగద్గురు వేదవ్యాస భగవానుని జయంతి గురుపూర్ణిమ అని బెస్త సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు పుట్టుబోయిన సుబ్బరాయుడు తెలిపారు. మహిమలూరులోని వ్యాసంతి బెస్త కులబంధువులు గురుపూర్ణిమ పండుగను ఘనంగా నిర్వహించుకున్నామని పేర్కొన్నారు. బెస్త సంఘీయులందరూ పాల్గొన్నారని సుబ్బరాయుడు పేర్కొన్నారు.

## ఉత్సవ మూర్తులకు అభిషేకం



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** రూరల్ మండలం నరసింహ కొండపై వెలసిన శ్రీ వేదగిరి లక్ష్మినరసింహస్వామి వారి దేవస్థానంలో ఆదివారం పౌర్ణమి తిథి సంధర్భంగా ఉత్సవ మూర్తులకు అభిషేకం. నిర్వహించారు. అలాగే గరుడ సేవ గిరి ప్రదక్షిణ ఉత్సవం కార్యక్రమాలు వేద పండితులు మంత్రోచ్చారణల మధ్య వైభవంగా జరిగాయి. ఉభయ కర్తలుగా పాటూరు గ్రామ వాస్తవ్యులు నరసింహారావు కుటుంబ సభ్యులు వ్యవహరించగా, కార్యక్ర మంలో కార్యనిర్వహణాధికారి గిరికృష్ణ, అర్చక సిబ్బంది, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

**జి**ల్లా సరిహద్దు ప్రాంతమైన మర్రిపాడు మండలంలోని బొగ్గేరు నుంచి ఇసుక నిత్యం ట్రాక్టర్లతో తరలిపోతోంది. ఫలితంగా ఆయా పారస్తులకు కాసుల వర్షం కురిపిస్తుంది. ఈ రవాణాను అడ్డుకోవాల్సిన సెబ్ అధికారులు మామూళ్ల మత్తులో ఉండడంతో వారి వ్యాపారానికి అవధులు లేకుండా పోతుంది. చివరకు రాత్రులు కూడా బరితెగించి బొగ్గేరు నుంచి రవాణాను సాగిస్తున్నారు.

- నిత్యం ట్రాక్టర్లతో తరలింపు





# బొగ్గేరును తవ్వేస్తున్నారు !

- కాసులు కురిపిస్తున్న ఇసుక వ్యాపారం - మామూళ్ల మత్తులో సెబ్ అధికారులు

**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :**

మర్రిపాడు మండలంలో ఇసుక రవాణాకు సంబంధించిన వ్యాపారులకు అడ్డూ అదుపు లేకుండా పోతుంది. మండలంలో ప్రధానంగా బొగ్గేరు ఇసుక వరప్రసాదమైంది. దీనిని ఆసరాగా చేసుకున్న వ్యాపారస్తులు సంబంధిత అధికారులను లోపర్చుకొని రవాణాను యదేచ్ఛగా సాగిస్తున్నారు. మండల పరిధిలోని బూదవాడ, కృష్ణాపురం, పెగళ్లపాడు, చిలకపాడు, రాజులపాడు, సన్ను వారిపల్లి, భీమవరం, నందవరం, రామానాయుడు పల్లి ప్రాంతాల నుంచి ఈ ఇసుక అక్రమ రవాణా యదేచ్ఛగా సాగుతోంది. ఒక్క ట్రాక్టర్ టక్కు ఇసుక ధర రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు వసూలు చేస్తున్నారు. అయితే వ్యాపారస్తులకు మాత్రం అక్కడ కూలీలకు పడే ధర కేవలం వెయ్యి రూపాయలు మాత్రమే. దీంతో వ్యాపారస్తులు వేలాది రూపాయలను సొమ్ము చేసుకుంటున్నారు. సంబంధిత అధికారులు అడ్డొస్తే ఎంతో కొంత అప్పజెప్పి పంపించి వారి రవాణాను యదేచ్ఛగా సాగిస్తున్నారు. దీంతో ఆ అధికారులు కూడా చూసీ చూడనట్లు వెళ్తున్నారు. నిత్యం వ్యాపారం చేసే వ్యాపారస్తులు మాత్రం ప్రతినెల మామూళ్లు ఇస్తున్నట్లు సమాచారం. ఆయా గ్రామాల పరిధిలో ఉండే సచివాలయాల్లో పన్ను రసీదులు కట్టి ఇసుకను తోలుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అలాంటి తరుణంలో ఎలాంటి పన్ను

మిగతా 02లో

- కాగితాలకే పరిమితమైన ప్రతిపాదనలు
- నూతనప్రభుత్వం పై ఆశలు
- దృష్టిసారిస్తున్న మంత్రి 'ఆనం'




# ఆశల పల్లకిలో ఆత్మకూరు సుందరీకరణ

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :**

**ఆ**త్మకూరులో సుందరీకరణ ఆశల పల్లకిలో కొట్టుమిట్టాడుతోంది. సుందరీకరణ పేరుతో మంత్రి మేకపాటి గౌతంరెడ్డి కలలు గన్న ఊహాచిత్రాల ప్రతిపాదనలు ఆయన మృతితో కాగితాలకే పరిమితయ్యాయి. ఈ ప్రతిపాదనలకు నిధులు మంజూరై అమలుకు నోచుకుంటాయా.. లేదా.. అనేది ప్రశ్నార్ధకమైంది. ఇక్కడ ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తూ, రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, వాణిజ్య శాఖల మంత్రి మేకపాటి గౌతంరెడ్డి హయాంలో మున్సిపాలిటీలో పెద్దగా అబివృద్ధి జరగకపోగా రెండేళ్ళ క్రితం అనేక ప్రణాళికలు రూపొందించారని, త్వరలో కార్యరూపం దాల్చుతాయని చెబుతున్న తరుణంలో ఆయన గుండెపోటుకు గురై హఠాన్మరణం పొందారు. గత ప్రభుత్వ హయాంలో ఆత్మకూరు శివార్లలోని బట్టేపాడు మార్గంలోని వాటర్‌ప్లాంటు సమీపంలో ఖాళీస్థలంలో పార్కు నిర్మించే రూ.కోటి మంజూరు చేయడంతోపాటు పనులు కూడా ప్రారంభించి చుట్టూరా.. కొంత ప్రహరీ గోడ నిర్మించి అర్ధాంతరంగా పనులు నిలిపివేశారు. ఇక ఆ పార్కు పనులకు అతీగతీ లేదని భావిస్తున్న తరుణంలో గత మేనెలలో పలు అభివృద్ధి కార్యక్రమాల గురించి అప్పటి ఎమ్మెల్యే, రాష్ట్ర ఐటి, పరిశ్ర మలు, వాణిజ్య, జౌళి, నైపుణ్యాభివృద్ధి శాఖల మంత్రి మేకపాటి గౌతంరెడ్డి అధికారులతో చర్చించారు. ఆత్మకూరులోని

-మిగతా 2లో

## రాష్ట్రంలో మేధావి వర్గాలు జనసేన వైపు

- నీతికి, నిజాయితీకి కట్టుబడి ఉండే డిప్యూటీ సీఎం
- అలాంటి గొప్ప వ్యక్తి అడుగుజాడల్లో నడవడం అదృష్టంగా భావిస్తున్నాం
- సభ్యత్వ నమోదులో నెల్లూరు జనసేన రికార్డ్ సాధించాలి
- జనసేన లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు చదలవాడ రాజేష్

2లో



# కనుమరుగవుతున్న కాటుక పాపన్నలు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** సమాజంలో గతంలో విశేషాదరణ పొందిన కాటుక పాపన్నలు క్రమీణా కనుమరుగవుతున్నారు. ఆత్మకూరులో ఓ వ్యక్తి కాటుక పాపన్న వేషధారణలో వీధివీధినా తిరుగుతూ యాచిస్తుండగా ఆయనను పలకరిస్తే.. తమ ఆవేదనను, గోడును వెళ్ళగక్కాడు. శ్రీశైలంకు చెందిన మారెప్ప అనే వ్యక్తి నల్లకోటు, మెడలో వివిధ రుద్రాక్షలు, దండలు, ముఖాన కాటుకతో ఉంటూ తిరుగుతుండగా ఆయనను **'మేజర్ న్యూస్'** పలకరిస్తే.. పుట్టెడు కష్టాలను వివరించారు. తాము బుడబుక్కల జాతులవారమని, కర్నూలు, అనంతపురం, చిత్తూరు, కడప, నెల్లూరు, గుంటూరు, ప్రకాశం, కృష్ణా తదితర జిల్లాల్లో వేలాదిగా తమ జాతులవారున్నారని, శ్రీశైలంలో తాము దాదాపు 500 కుటుంబాల వారం ఉన్నామని, గతంలో జిల్లావ్యాప్తంగా కటుక పాపన్న వేషధారణలతో పర్యటించేవారమని, గారఢీ చేస్తూ, జాతకాలు చెబుతూ సంభావనలు స్వీకరించేవారమని, ఒక్కో గ్రామంలోనే వారంరోజులు ఉంటూ గ్రామ శివార్లలో పాఠశాల వరండాలు, చావడులు, పంచాయతీ కార్యాలయాలు, దేవాలయాల ప్రాంగణాల్లో తల దాచుకుంటూ రెండు, మూడు నెలలపాటు వివిధ ప్రాంతాల్లో పర్యటించి సంపాదించుకున్న ధాన్యం, నగదులతో ఊరు చేరుకొని జీవనం సాగించేవారమన్నారు.

**ఎస్సీల జాబితా అంశం అయోమయం**



గతంలో తాము గ్రామాల్లో తిరుగుతుంటే తమను చూడగానే చిన్నా, పెద్దా తేడా లేకుండా తమ వద్ద గుమికూడేవారని, తమ సంపాదన గిట్టుబాటుగా ఉండేదని, కులవృత్తిగా సాగించేవారమని, కొంత కాలంగా టీవీలు, మొబైల్ ఫోన్ల ప్రభావం, క్రమీణా తమ గారడీలను తిలకించి ఆస్వాదించే పరిస్థితి గణనీయంగా తగ్గడంతో తాము ఈ వృత్తిని సాగించే అవకాశం లేక, ఇతరత్రా పనులు చేసుకోలేక, ఆర్థిక వసతి లేక ఏదేని వ్యాపారాలు చేసుకోలేక ఇబ్బందిపడుతున్నామని మారెప్ప వివరించారు. అదీగాక తమ కులాన్ని ఎస్‌సిల జాబితాలో చేర్చామని పాలకులు చెబుతున్నా అధికారులు ఆ మేరకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, తెలంగాణాలో మాత్రం తమ కులం ఎస్సీల జాబితాలో ఉండగా మన రాష్ట్రంలో లేదని, అప్పట్లో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తమకు హామీ ఇచ్చినా అమలుకు నోచుకోలేదని, పేదలమైన తాము కొంత చందాలు వేసుకొని రాజధానిలో పాలకులకు మొరపెట్టుకున్నామని, పలు దఫాలు ఆందోళనలు చేశామని, అయినా ఫలితం లేకపోయిందని, రానున్న సంక్రాంతి అనంతరం మళ్లీ ఓమారు ఆందోళన చేసేలా తమ పెద్దలు యోచిస్తున్నారని మారెప్ప పేర్కొన్నారు. తమ బిడ్డలను ఉన్నంతలో వ్యయం చేసి చదివించుకున్నామని, వారికి ఉద్యోగావకాశాలు లేక, రిజర్వేషన్ సౌకర్యం లేక నిరుద్యోగులుగా ఉంటున్నారని, కొందరు మాత్రం చిన్నపాటి వ్యాపారాలు చేసుకుంటున్నారని, తాము ఆదరణ లేకున్నా ఆనవాయితీగా అక్కడక్కడ యాచన సాగిస్తున్నామని, ఆత్మకూరులో రెండు రోజులుగా తిరుగుతుండగా తమ గారడిని చూసే వారు లేకపోగా తగిన సంభావనలు కూడా గిట్టుబాటుగా లభించడం లేదని మారెప్ప ఆవేదనతో తెలిపాడు, ఇలాంటి వారి గోడును ప్రభుత్వంలోని పాలకులు యోచించి తగిన రీతిలో ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# బొగ్గేరును తవ్వేస్తున్నారు..!

*(మొదటి పేజీ తరువాయి)*



కట్టకుండా రవాణాను సాగిస్తున్న అధికారులు మౌనంగా ఉండడం విశేషం.

**సిమెంట్ ఇటుక వ్యాపారానికి కూడా..**

మర్రిపాడు మండలంలో సిమెంట్ ఇటుక వ్యాపారం కూడా జోరుగా నడుస్తోంది. ఈ వ్యాపారానికి కూడా ఇసుక ఎంతో ప్రధానమైనది. ఆ వ్యాపారస్తులు కూడా బొగ్గేరు ఇసుకను యదేచ్ఛగా తరలిస్తున్నారు. ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయకుండా ఇసుకని తరలించుకుంటూ వ్యాపారాన్ని సాగిస్తూ జేబులు నింపుకుంటున్నారు. ఈ సిమెంట్ ఇటుక బట్టీలు కృష్ణాపురం బూదవాడ మర్రిపాడు చుంచులూరు డిసిపల్లి ప్రాంతాల్లో ఉన్నాయి. ఈ బట్టీలకు నిత్యం ఇసుక ఎంతో అవసరం. వ్యాపారం సాగాలంటే ఇసుక ఉండాల్సిందే. అలాంటి నేపథ్యంలో ట్రాక్టర్లతో ఈ వ్యాపారస్తులు ఇసుకను బొగ్గేరు నుంచి అక్రమంగా తరలిస్తున్న సంబంధిత అధికారులు మౌనం దాల్చడం ఎంతో విడ్డూరంగా ఉందని మండల ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కావున ఇప్పటికైనా సంబంధిత అధికారులు పట్టించుకోని ఈ ఇసుక అక్రమ రవాణాను అడ్డుకట్ట వేయాల్సిందిగా పలువురు కోరుతున్నారు.

# నిజాయతీ చాటుకున్న కండక్టర్



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి డిపోకి చెందిన కండక్టర్ కె.శ్రీనివాసులు ఈనెల 17 తేదీ తన బస్సులో దొరికిన 1700 రూపాయలు డబ్బులు, ఏటీఎం కార్డులు, ఆర్సీ కార్డులు, లైసెన్స్ కార్డు, కలిగియున్న పర్సుని డిపో మేనేజర్‌కు అందజేశారు. డిపో మేనేజర్ కార్డులో ఉన్న అడ్రస్‌ను బట్టి వారికి ఫోన్ ద్వారా సమాచారం అందించారు. పర్సు పోగొట్టుకున్న సయ్యద్ మున్వర్ బాషాకు డిపో మేనేజర్ సమక్షంలో కండక్టర్ శ్రీనివాసులు చేత పర్సును అందించారు. కండక్టర్ నిజాయతీకి డిపో మేనేజర్ తోటి కండక్టర్లు, డ్రైవర్లు అభినందించారు.

# రాష్ట్రంలో మేధావి వర్గాలు జనసేన వైపు



నెల్లూరు, మేజర్‌న్యూస్ : రాష్ట్రంలో మేధావి వర్గాలన్నీ జనసేన పార్టీ వైపు చూస్తున్నాయని ఆ పార్టీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు చదలవాడ రాజేష్ పేర్కొన్నారు. శనివారం స్థానిక గోమతి నగర్‌లోని జనసేన పార్టీ కార్యాలయంలో చదలవాడ రాజేష్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో జనసేన పార్టీ ప్రభంజనం సృష్టించిందని తెలిపారు. జననేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పట్ల ప్రజలకు సంపూర్ణమైన విశ్వాసం ఉందని రుజువైందన్నారు. భవిష్యత్తు తరాలకు పవన్ కళ్యాణ్ ఒక రోల్ మోడల్ అని వ్యాఖ్యానించారు. పేద ప్రజల ఆశాజ్యోతి పవన్ కళ్యాణ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. నీ నిజాయితీకి కట్టుబడి ఉండే డిప్యూటీ సీఎం భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. జిల్లాలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని రికార్డు స్థాయిలో చేపట్టాలని పిలుపునిచ్చారు. పవన్ కళ్యాణ్ అడుగుజాడల్లో నడుస్తూ సమాజ శ్రేయస్సుకు కృషి చేయాలని పార్టీ కార్యకర్తలు నాయకులకు ఆయన దిశ నిర్దేశం చేశారు. జనసేన పార్టీ కోర్ కమిటీ సభ్యుడు, సీనియర్ నాయకుడు నూనె మల్లికార్జున యాదవ్ మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా క్షేత్రస్థాయిలో జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు, సభ్యత్వ నమోదు కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు గునుకుల కిషోర్, న్యాయవాదులు శరత్, శ్రీరామ్, గురు కుమారు, చిరంజీవి, మధు, సుభాషిని, ఆరతి , జమున రాణి, గోపాల్, ప్రసాద్, కిరణ్ కుమార్, రషీద్ తదితరులు పాల్గొన్నారు.

# ఆశల పల్లకిలో ఆత్మకూరు సుందరీకరణ




*(మొదటి పేజీ తరువాయి)*

రవితేజ కళ్యాణ మండపం వద్ద నుండి సత్రం సెంటరు, పంటవీధిల మీదుగా బట్టేపాడు రోడ్డు మీదుగా ఆత్మకూరు ఎల్ఆర్‌పల్లిలో కలిసేలా ఔటర్‌రింగ్ రోడ్డు, వాటర్ ప్లాంటు వద్ద పార్కు నిర్మాణం, చెరువు వద్ద మినీట్యాంక్ బండ్‌ల నిర్మాణాలకు మంత్రి ప్రతిపాదించడం, ఆయన నేరుగా ఈ ప్రాంతాలను పరిశీలించడం, తదుపరి పలువురు రాష్ట్ర, జిల్లా అధికారులు పరిశీలించి ప్రతిపాదనలను సిద్ధం చేసేందుకు పూనుకోవడం తెలిసిందే. ఈ పనులకు సంబంధించి అధికారులు ఊహాచిత్రాలను రూపొందించారు. వాటిని మంత్రి గౌతంరెడ్డి పరిశీలించారు. పార్కు, ట్యాంక్‌బండ్, ఔటర్‌రింగ్ రోడ్డు, ఆత్మకూరు సుందరీకరణ కార్యక్రమాలు ఆరు నెలల్లోగా పూర్తి చేయాల్సి ఉందని, ఆత్మకూరులో ఈ కార్యక్రమాల నిర్మాణాలకు రూ.5 కోట్లు, నియోజకవర్గానికి రూ.10 కోట్లు నిధులు మంజూరు చేస్తామని గౌతంరెడ్డి పేర్కొన్నా రు. పార్కు ట్యాంక్‌బండ్‌ల వద్ద అన్నీ సౌకర్యాలతో, నీడనిచ్చే, పండ్లనిచ్చే మొక్కలు నాటి పెంచాలని, ఆకర్షణీయంగా రూపొందించాలని, వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఊహాచిత్రాలను ఆయన పరిశీలించి స్వల్ప మార్పుల కోసం సూచనలు కూడా చేశారు. ఆరు నెలల్లోనే పనులు పూర్తి చేయాలని మంత్రి ఆదేశించినా.. నిధులు మంజూరు కాలేదు. అయితే మంత్రి గౌతం రెడ్డి హఠాన్మరణంతో ఈ ప్రతిపాదనలు ఇక కార్యరూపం దాల్చుతాయా.. అనే సందేహం పలువురిలో నెలకొంది. నిధుల మంజూరుకు ఎవరు చర్యలు తీసుకుంటారు. ఆయన స్థానంలో వారసులు ఎవరనే చర్చలు సాగుతుండగా, మంత్రి మరణంతో ఈ పనులు అటకెక్కుతాయా.. అనే సందేహం కూడా వ్యక్తమవుతుండగా, ఆయన వారసుడుగా ఆయన సోదరుడు మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆత్మకూరు ఎమ్మెల్యేగా ఉప ఎన్నికల్లో విజయం సాధించారు. రెండున్నరేళ్లయినా సుందరీకరణకు ప్రభుత్వం నుండి నిధులు మంజూరు కాలేదు. దివంగత గౌతంరెడ్డి ఆశయ సాధనలో భాగంగా ఆత్మకూరు సుందరీకరణ కార్యక్రమానికి నిధులు సాధించి అమలు చేయించాలన్న ఆకాంక్ష మాత్రం సర్వత్రా వ్యక్తమవుతోంది. మరో రెండు నెలల్లోనే ఎన్నికలు రానుండడంతో ఇక ఈ ప్రాజెక్టు పనులు జరిగేలా లేవని సర్వత్రా అసంతృప్తి వ్యక్తం చేస్తుండేవారు. కాగా ఇటీవల సార్వత్రిక ఎన్నికలు జరగడం, ఆత్మకూరు అభివృద్ధి ప్రదాత, సీనియర్ నేత ఆనం రామనారాయణరెడ్డి ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించడంతోపాటు రాష్ట్ర మంత్రివర్గంలో చోటు సాధించారు. ఆయన ఆత్మకూరు అభివృద్ధిని గతంలో పరుగులు తీయించడం, అందరూ అభివృద్ధి అంటే ఆనం అని భావిస్తుండడంతో సుందరీకరణపై ఆశలు పెరిగాయి. ఈ విషయమై మంత్రి రామనారాయణరెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నారని, అధికారులతో చర్చిస్తున్నారని, కార్యరూపం దాల్చే అవకాశాలు మెండుగా ఉన్నాయని తెలుస్తోంది. చర్యలు ఎప్పుడు ఆరంభమవుతాయో వేచిచూడాల్సి ఉంది.



# నృత్యవిద్యాలయ ఆర్గనైజర్ అపర్ణకు నాట్యప్రవీణ గౌరవ పురస్కారం

## నృత్యకులకు నాట్యకిరణ అవార్డులు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులోని శ్రీ భారతి సంగీత, నృత్యవిద్యాలయ ఆర్గనైజర్ కె.అపర్ణాచక్రవర్తికి నాట్యప్రవీణ అవార్డుతో గౌరవ పురస్కారం లభించింది. ఇటీవల గురు వందన నృత్యోత్సవంలో భాగంగా శ్రీ మయూరి నృత్యాలయ సాంస్కృతిక సేవాసంస్థ హైదరాబాదులోని రవీంద్రభారతిలో నృత్యోత్సవ కార్యక్రమం నిర్వహించగా రెండు రాష్ట్రాలకు చెందిన పలువురు పాల్గొనగా ఆత్మకూరుకు చెందిన శ్రీభారతి సంగీ, నృత్య విద్యాలయం ఆర్గనైజర్ కె.అపర్ణ ఆధ్వర్యంలో డ్యాన్స్‌మాస్టర్ ఆనంద్, నృత్యంలో తర్ఫీదుపొందినవారు పాల్గొన్నారు. ఈ వేదికపై ఆత్మకూరుకు చెందిన భారతి విద్యాలయంలో తర్ఫీదుపొందిన కళాకారులు అపర్ణ ఆధ్వర్యంలో నృత్యప్రదర్శన ప్రదర్శించారు. అత్యద్భుతంగా ప్రదర్శించడంతో సంస్థ నిర్వాహకురాలు అపర్ణకు నాట్యప్రవీణ అవార్డుతో సత్కరించి ప్రముఖుల చేతుల మీదుగా పురస్కారం అందజేశారు. డ్యాన్స్‌మాస్టర్ ఆనంద్‌కు కూడా అవార్డు బహూకరించడంతోపాటు నృత్య ప్రదర్శన గావించిన వారికి నాట్యకిరణ అవార్డులను బహూకరించారు. నాలుగేళ్ళుగా శ్రీభారతి సంగీత, నృత్య విద్యాలయాన్ని నిర్వహిస్తున్న అపర్ణ అనేకమందికి సంగీతం, నృత్యంలో తర్ఫీదునిచ్చారు. వివిద స్థాయిల్లో వారు ప్రదర్శనలివ్వడంతోపాటు ఉమ్మడి తెలుగురాష్ట్రా ప్రధాన కేంద్రమూన హైదరాబాదులోని రవీంద్రభారతిలో వారు తమ నృత్యం ద్వారా విశేషప్రతిభ చూపడంతో వారికి ఈ గౌరవపురస్కారం లభించింది. కూచిపూడినాట్య గురువు, కేంద్ర సంగీత, నాటక అకాడమి సభ్యురాలు ఎస్.పి.భారతి, తెలంగాణా రాష్ట్ర వెనుకబడిన తరగతుల కమీషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, వనపర్తిజిల్లా అడిషనల్ ఎస్పి రామ్‌దాస్ తేజావత్, యువ కళావాహిని అధ్యక్షులు లంక లక్ష్మీనారాయణ, ప్రముఖ సినీనటి రాగిణి, సీనియర్ జర్నలిస్ట్ నస్రీన్‌ఖాన్, నాట్యరత్న, మయూరి నాట్యనిలయం ప్రతినిధి శ్రీదేవి, మయూరి నృత్యాలయ డైరెక్టర్ నాట్యకిన్నెర నందితరాజనాల, ఆర్గనైజర్ రామ్‌కుమార్‌లు తదితరులు అతిధులుగా పాల్గొన్ని అపర్ణా చక్రవర్తికి నాట్యప్రవీణ, నృత్యకులకు న్యాకిరణ్ అవార్డులను బహూకరించారు.

ఈ సందర్భంగా ఆత్మకూరులో కళాభిమానులు, ప్రోత్సాహకులు, వివిద ప్రజాసంఘాల ప్రతినిధులు అపర్ణా చక్రవర్తిని, డ్యాన్స్‌మాస్టర్ ఆనంద్‌ను, నృత్యప్రదర్శన చేసినవారిని అభినందించి వారు భవిష్యత్తులో మరిన్ని పురస్కారాలు పొందాలని ఆకాంక్షించారు.

# సాయిబాబా మందిరంలో గురుపూర్ణిమ ఉత్సవాలు





**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలోని శ్రీశ్రీశ్రీ అన్నపూర్ణాసమేత కాశీవిశ్వేశ్వరాలయం ప్రాంగణంలోని శ్రీశ్రీశ్రీ షరిడిసాయిబాబా మందిరంలో ఆదివారం గురుపూర్ణిమ మందిరకమిటి ఆధ్వర్యంలో గురుపూర్ణిమ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. శివాలయం ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ మేళ్ళచెరువు శివకుమార్‌శరమ్మ (శివయ్యస్వామి ఆధ్వర్యంలో ఈకార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురుపూర్ణిమ శ్రీ సాయిబాబాకు అత్యంత ప్రీతిపాత్రమైన పర్వదినమని, పుడమిని పునీతం చేసేందుకు మానవరూపంలో అవతరించిన శ్రీ దత్తాత్రేయుని పరిపూర్ణస్వరూప ఆవిష్కారమే శ్రీ షిరిడిసాయినాధుడని శివకుమార్‌శర్మ తెలిపారు. ఆదిశంకరుడు ఆదిభిక్షువు అయినట్లు సర్వసంపదలొసగే శ్రీ సాయి భిక్షకు వెళ్లేవారని, అమీతం పంచిపెట్టే ఆపరమాత్మ భిక్ష కోసం జోలిపడితే భిక్షపెట్టే అమృతమూర్తులు ఎంతో పుణ్యజీవులని పేర్కొన్నారు. ఆ సద్గురు ఆచారాన్ని అనుసరిస్తూ ఈ పండుగ సందర్భంగా భక్తులు జోలెపట్టి భిక్షకు వెళ్ళగా భిక్షపెట్టే అమృతమూర్తులు ఈకార్యక్రమంలో విరివిగా పాల్గొని భిక్షను అందించి స్వామివారి కృపాకటాక్షాలు పొందారని వారుపేర్కొన్నారు. ఆదివారం గురుపూర్ణిమ కార్యక్రమంలో భాగంగా ఉదయం 6గంటలకు కాకడహారతి, 7గంటలకు పాలాభిషేకం(భక్తులు స్వయంగా చేయవచ్చును), 8గంటలకు సామూహిక శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం, ఉదయం 9గంటలనుండి మధ్యాహ్నం 12గంటల వరకు మహాన్యాస పూర్వహరుద్రాభిషేకం కార్యక్రమాలు స్థానిక శివాలయం ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ మేళ్ళచెరువు శివకుమార్‌శర్మ (శివయ్యస్వామి) ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా జరిగాయి. బాబాభక్తబృందం రామిరెడ్డి బుజ్జిరెడ్డి బృందంచే భజన కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం 1గంటకు అన్నప్రసాదవితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమాల్లో ఉభయకర్తలుగా స్థానిక న్యూమహలక్ష్మిజ్యూయలర్స్ అధినేతలు పొన్నూరు హరికృష్ణ-జయప్రద దంపతులు వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి భక్తులు విరివిగా హాజరై స్వామివారి కరుణాకటాక్షాలు పొందారు.

# గురు పౌర్ణమి సందర్భంగా సాయినాధునికి ప్రత్యేక పూజలు



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** గురు పౌర్ణమి సందర్భంగా ఆదివారం సాయినాధునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పిడతా పోలూరు రోడ్డు మార్గమున కొలువుతీరిన సాయి మందిరం నందు ఆలయ వ్యవస్థాపకులు ఉమా రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే గురుపౌర్ణమి వేడుకలు జరిపారు. పెద్ద ఎత్తున సాయిబాబా భక్తులు విచ్చేసి బాబాను దర్శించుకున్నారు. ఈ నేపద్యంలో తీర్థప్రసాదాలు తీసుకున్నారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రత్యేక పూజలు అదేవిధంగా సాయినాధునికి పాలాభిషేకం, చందన అలంకారం, కుంకుమ పూజ లుజరిగాయి. చుట్టు పక్కల గ్రామాల నుండి వచ్చిన సాయినాధు భక్తులు సాయిబాబాను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భజన భక్త బృందం భజన కార్యక్రమం నిర్వహించారు. ఈ నేపథ్యంలో మధ్యాహ్నం సాయినాధుడుని దర్శించుకున్న భక్తులకు అన్నదానం జరిగింది. ఈ కార్యక్రమంలో సాయిబాబా భక్తులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# కళలు బహుళ ప్రయోజనకరం

## ప్రోత్సహించడం ఆవశ్యకం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** సమాజంలోని అందరికీ కళలు అవసరమని, బహుళ ప్రయోజకరమని, ప్రోత్సాహం అత్యంతావశ్యకమని ఆత్మకూరులోని శ్రీ భారతి సంగీత, నృత్య విద్యాలయం ఆర్గనైజర్ కె.అపర్ణాచక్రవర్తి పేర్కొన్నారు. ఆదివారం గురుపూర్ణిమ సందర్భంగా గురువందన కార్యక్రమాన్ని విద్యాలయంలో ఆమె ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇటీవల హైదరాబాదులోని రవీంద్రభారతిలో మయూరి నాట్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన గురువందననృత్యోత్సవంలో అపర్ణ ఆధ్వర్యంలో తమవద్ద నృత్యంలో తర్ఫీదు పొందినవారితో ప్రదర్శన నిర్వహించారు. అపర్ణకు, డ్యాన్స్‌మాస్టర్ ఆనంద్‌కు నాట్యప్రవీణ, నృత్యకులకు నాట్యకిరణ అవార్డులు లభించాయి. ఈసందర్భాన్ని పురస్కరించుకొని నిర్వహించిన ఈ కార్యక్రమంలో నృత్యకులను ఆమె అభినందించారు. ఎవరైనా తమకు ఆసక్తి ఉన్న కళలపట్ల దృష్టి సారించి తర్ఫీదు పొంది ప్రదర్శనలు ఇస్తే బహుళప్రయోజకరమని, సమాజానికి సందేశమివ్వగలరని, మానసిక ప్రశాంతత పొందగలరని, మానసికవత్తిడి తగ్గుతుందని, ప్రజలకు వినోదం అందించగలరని ఆమె పేర్కొన్నారు. ఎంతో వ్యయప్రయాసలతో తాను నృత్యవిద్యాలయం ఏర్పాటు చేసి తనవంతుగా కళామతల్లికి సేవలందించడంతోపాటు ఆసక్తిగలవారికి సంగీ, నృత్య శిక్షణను అందుబాటులోకి తెచ్చానని ఆమె పేర్కొన్నారు. సంగీతం, నృత్య ప్రదర్శనలు మానసికరుగ్మతలను దరిచేరనివ్వబోవని అపర్ణ పేర్కొన్నారు. డ్యాన్స్ మాస్టర్ ఆనంద్ మాట్లాడుతూ.. సంగీతం, నృత్యంలో తమవద్ద శిక్షణ పొందినవారు గౌరవ, ప్రతిభా పురస్కారాలు పొందడం సంతోషదాయకమని, ఇంకా భవిష్యత్తులో మరిన్ని పురస్కారాలు సాధించాలని కోరారు. కళలను ప్రత్సోహించేందుకు, సంగీతం, నృత్యంలో శిక్షణ పొందేందుకు అందరూ తమవంతుగా ప్రోత్సహించాలని ఆనంద్ కోరారు. ఈ సందర్భంగా ఆనంద్‌ను శాలువా, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంగీత, నృత్యవిద్యాలయాభివృద్ధికి విశేష ప్రోత్సాహమిస్తున్న కె.చక్రవర్తి, సంస్థను ప్రోత్సహిస్తున్న కళాకారులు రాగరంజిత, నాగనందిత, స్థానిక శ్రీవెంకటేశ్వర ప్రజావైద్యశాల నిర్వాహకురాలు, నృత్యంలో ప్రతిభచూపి అవార్డు పొందిన డాక్టర్ ఎం.హారిక, ఎస్‌వి డిగ్రీకాలేజి అధ్యాపకులు చంద్రశేఖర్, హైదరాబాదులో అవార్డులు పొందిన నృత్యకళాకారులు డాక్టర్ హారిక, గీతిక, దీపిక, ఆధ్య, లక్ష్య, స్వప్న, శరణ్య, వారి తల్లులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# మర్రిపాడు వద్ద రోడ్డు ప్రమాదం

- మోటార్ సైకిల్ను ఢీ కొట్టిన కారు
- కంద్రిక వాసి మృతి



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు-ముంబై జాతి రహదారిపై మర్రిపాడు సమీపంలోని అచ్చమాంబ ఆలయం వద్ద ఆదివారం మోటార్ సైకిల్‌ను కారు ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మర్రిపాడు మండలం పీ కంద్రిక వాసి కుంకు తిరుపతయ్య (35) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. తన స్వగ్రామం నుంచి మర్రిపాడుకు అవసరాల నిమిత్తం మోటార్ సైకిల్ పై వెళ్లి తిరిగి వస్తుండగా నెల్లూరు వైపు నుంచి నంద్యాల వెళ్తున్న ఓ కారు ఢీ కొట్టింది. దీంతో తిరుపతయ్య కాలు భాగం తీవ్రంగా గాయపడి తెగిపడింది. దీంతో స్థానికులు ప్రయాణికులు కుటుంబ సభ్యులు వెంటనే ఆత్మకూరు వైద్యశాలకు తరలించారు. అప్పటికే కాలు భాగంలో రక్తస్రావం ఎక్కువగా పోవడంతో చికిత్స పొందుతూ తిరుపతయ్య మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యుల ఆర్తనాధాలకు అంతులేకుండా పోయింది. ఫలితంగా గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతి చెందిన తిరుపతయ్య స్థానిక గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యా కమిటీ చైర్మన్‌గా పనిచేస్తున్నాడు. ప్రమాదానికి కారణమైన కారును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# జ్ఞానసాగరుడు.. వేదవ్యాసుడు



బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ : వేదాలను క్రమబద్ధీకరించి మహాభారతాన్ని లోకానికి అందించిన జ్ఞానసాగరుడు వేద వ్యాసుడని సమరసత బాల వికాస కేంద్రం జిల్లా సహ కన్వీనర్ తాళ్లపాలెం నారాయణ అన్నారు. బుచ్చిరెడ్డిపాలెం మండలంలో రామచంద్రారెడ్డి నగర్, రేబాల పడమర హరిజనవాడలో వేదవ్యాసుడు జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు సంస్కృతి సంప్రదాయాలు, దేశభక్తి, క్రమశిక్షణ, భారతదేశ ఆధ్యాత్మికతను విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. నేటి నుండి బాలవికాస కేంద్రాలను పునః ప్రారంభిస్తున్నామని సాయంత్రం గంటపాటు పిల్లలకు చదువుతోపాటు సంస్కారం, కళలు, సంస్కృతి, దేశభక్తి గేయాలను బోధిస్తామన్నారు. వేదవ్యాసుడు చిత్రపటానికి విద్యార్థులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా చిన్న పిల్లల వైద్య నిపుణులు ఎన్‌వి రాజు, గురుబ్రహ్మ పురస్కార్ గ్రహీత గండి కోట సుధీర్ కుమార్ పాల్గొని గురువు విశిష్టత గురించి వివరించారు. విద్యార్థులకు పుస్తకాలు, కలాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ అండగుండ శ్రీనివాసులు, మాతాజీ శ్రీజ, కేశవ, విద్యార్థులు పాల్గొన్నారు.

## సీఎంని కలిసిన మండవ వెంకట్రావు



కావలి, మేజర్‌న్యూస్ : కావలి విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర ఉపాధ్యక్షులు మండలం వెంకట్రావు శనివారం తెలుగుదేశం పార్టీ మంగళగిరి ఆఫీస్ నందు నారా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కలిసి దివ్యాంగులకు 6వేల రూపాయల పెన్షన్ పెంచినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి తన కొరకు సిఫారసు లెటర్ ఇవ్వడం జరిగింది. ఆ లెటర్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి అందివ్వగా సంతోషంగా స్వీకరించారు. దివ్యాంగులకు రాష్ట్రంలో ప్రతి మండలంలో కనీసం 200 మందితో ఒక దివ్యాంగుల కాలనీ ఫింగర్ ప్రింట్స్ ఐరిష్ పడనివారికి ఆన్‌లైన్‌లోనే కాకుండా నెలకు 15000 వేల రూపాయల పెన్షన్‌ని అందించాలని, అన్ని రకముల దివ్యాంగులకు 75శాతం ఆర్టీసీ రాయితీ పాసులు ఇవ్వాలని, వీల్ చైర్స్ ఉపయోగించు వారికి నెలకు పదివేల రూపాయలు పెన్షన్ ఇవ్వాలని, దివ్యాంగుల స్థలాలు కాలనీలు, సకలాంగులు ఆక్రమిస్తే వాటిని వెంటనే వికలాంగులకు ఇచ్చి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి గోనుగుంట కోటేశ్వరరావు, ఉప్పుటాల రవి, బట్టల శ్రీనివాసులు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి మరియమ్మ, అమరావతి, అమిరిశెట్టి వెంకటేశ్వర్లు, బోగోలు శ్రీనివాసులు, కృష్ణ, గంగయ్య అనంతపురం జిల్లా అధ్యక్షులు అధిక సంఖ్యలో దివ్యాంగులు పాల్గొన్నారు.

## రేపూరులో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు



అనంతసాగరం, మేజర్‌న్యూస్ : అనంతసాగరం మండలం రేపూరు గ్రామంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం జరిగింది. ఆ గ్రామ పూర్వ విద్యార్థి నెల్లూరు నగరంలోని ప్రముఖ వైద్యశాల అయిన ఎనెల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత కార్డియాలజిస్ట్ కే.నాగేంద్రప్రసాద్ సహకారంతో శిబిరాన్ని నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన శిబిరానికి సుమారు 1000 మంది రోగులు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకుని ఉచితంగా మందులు స్వీకరించారు. న్యూరాలజిస్ట్ డాక్టర్ కుంకాల లావణ్య, జనరల్ మెడిసిన్ డాక్టర్ దావూద్ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. చదివిన పాఠశాలలో, స్వలాభం కొంత వీడి పరుల కోసం పాటుపడు అన్న చందంగా ప్రసాద్ గ్రామాన్ని మరువలేదని పలువురు ఆయనను కొనియాడారు. గ్రామ పెద్దలు ప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు. పాఠశాల హెచ్‌ఎం అల్లం పార్టీ వెంకటేశ్వర్లు రెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

### సోమశిల జలాశయం వద్ద

## పర్యాటకుల సందడి



అనంతసాగరం, మేజర్‌న్యూస్ : సోమశిల ప్రాజెక్టు వద్ద ఆదివారం సాయంత్రం జిల్లాలోని పలు ప్రాంతాల నుండి వచ్చిన సందర్శకులు సందడి చేశారు. ప్రాజెక్టు పైన ఎర్త్ డ్యామ్, స్పిల్ వే వద్ద సంచరిస్తూ జలాశయ ప్రాంతాలను, ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ సెల్ఫీలతో ఆహ్లాదకరంగా గడిపారు. ప్రాజెక్టు పైన ఎటువంటి సిబ్బంది నియంత్రణ, పరిరక్షణ లేకపోవడంతో ప్రమాదకర ప్రాంతాల వరకు పర్యాటకులు వెళ్లడం జరిగింది. త్రాగేందుకు మంచినీరు ఏర్పాట్లు లేక పర్యాటకులు అసంతృప్తి వ్యక్తం చేశారు. జలాశయంలో నీటి నిల్వ అట్టడుగుకు దిగజారి ఉన్న పరిస్థితులను చూసి వాపోయారు. చల్లటి ఆహ్లాదకర వాతావరణం నెలకొని ఉన్న పరిస్థితుల నేపథ్యంలో ఎర్త్ డ్యాం పై గల పచ్చిక ప్రాంతంలో హాయిగా సేద తీరారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోండి : అదనపు కమిషనర్ శర్మద



నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిఆర్‌జిఎస్) కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలకు పరిష్కారం పొందాలని అదనపు కమిషనర్ శర్మద ఆకాంక్షించారు. తేది 22-07-2024 సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ మీటింగ్ హాల్‌లో ఉదయం 10.00 గంటలకు జరిగే కార్యక్రమంలో ప్రజలు వారి సమస్యల పరిష్కారం కోసం కార్యాలయంలో అదనపు కమీషనర్‌ను నేరుగా కలిసి సమస్యలను ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. అందుకున్న సమస్యలను వీలున్నంత త్వరగా పరిష్కారం అందించేందుకు అన్ని విభాగాలను సమన్వయం చేసుకొని కృషి చేస్తామని అదనపు కమీషనర్ తెలిపారు.

## సాయినాధునికి ప్రత్యేక పూజలు

▶ పూజలో పాల్గొన్న జనసేన నేత సుజయ్ బాబు



నెల్లూరు, మేజర్‌న్యూస్ : నెల్లూరు నగరంలోని 32వ డివిజన్ వెంగళరావు నగర్‌లో వేంచేసి ఉన్న శ్రీ సాయినాధునికి గురుపూర్ణిమ సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. జనసేన 32వ డివిజన్ ఇన్చార్జిలు సూరి, కన్నా, మస్తాన్ పిలుపుమేరకు జనసేన నెల్లూరు నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్ బాబు హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అర్చకులు స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. భక్తజనులకు నాయనానందకరం గావించి తన కరుణాపూరిత వీక్షణాలతో కటాక్షించారు. అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సుందరరామిరెడ్డి, జిల్లా కార్యదర్శి షేక్ ఆలియా, డివిజన్ ఇన్‌చార్జ్ అజయ్, షకీర్, ఆనంద్, శేషయ్యలు పాల్గొన్నారు.

## నృత్య కళాకారులకు ప్రేమ విందు ఏర్పాటు



కావలి, మేజర్‌న్యూస్ : కావలి పట్టణ నివాసులు ఇంజమూర్లో ఏఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న ఓ శ్రీనివాసులు వారి కుమారుడు కోడలు ఒట్టూరు అర్జున్ దంపతులు ఆస్ట్రేలియాలో నూతన గృహప్రవేశం చేయుచున్న సందర్భంగా కావలి పట్టణ తుఫాన్ నగలు సంయుక్త సేవా సంస్థ ద్వారా ఇటీవల హైదరాబాదులో శ్రీ శ్రీనివాస కళ్యాణ నృత్య రూప కానీ ప్రదర్శించి మంచి పేరు ప్రతిష్టలు తెచ్చుకున్న నృత్య కళాకారులకు, సంయుక్త సేవా సంస్థ కార్యాలయంలో చదువుతున్న విద్యార్థులకు మంచి విందు భోజనాన్ని ఏర్పాటు చేశారు. సంయుక్త సేవ సంస్థకు నిత్యం అవసరమైన 12 కుర్చీలనుఏఎస్ఐ శ్రీనివాసులు, ఆత్మకూరు కన్నయ్య ఒట్టూరు చిత్ర కల్పన సంస్థకు కుర్చీలను బహుకరించినారు. ఈ కార్యక్రమంలో దాత ఒట్టూరు శ్రీనివాసులు నీరజ దంపతులు, ఆత్మకూరు కల్లయ్య విజయలక్ష్మి దంపతులు, ఒట్టూరు. చిత్ర కల్పన వ్యవస్థాపక అధ్యక్షులు సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## నామినేటెడ్ పదవుల్లో లీగల్ సెల్‌కు..

# మొదటి ప్రాధాన్యత

**వరికుంటపాడు, మేజర్‌న్యూస్ :** రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అఖండ మెజారిటీతో గెలిచిన నేపథ్యంలో కష్టకాలంలో రాష్ట్రంలోనూ జిల్లా లోనూ నియోజకవర్గంలోనూ గ్రామాల్లోనూ వైసీపీ నాయకులు టిడిపి కార్యకర్తలు పై నాయ కులపై అనేక అక్రమ కేసులు దాడులు చేసిన తరుణంలో ప్రతి ఒక్క కార్యకర్తకు నాయకుడుకు తెలుగుదేశం పార్టీ లీగల్‌సెల్ అండగా నిలి చింది. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో పార్టీకి కష్టకాలంలో అండగా నిలిచినటువంటి వారికి మొదటి ప్రాధా న్యత కల్పించాలని తెలిపారు. అందులో భాగం గా రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు నాయకులకు ఏ ఆపద వచ్చినా ఏ ఆక్రమ కేసు పెట్టిన ఏ కార్యకర్తపై దాడి జరిగిన ఏ నాయకు డిని వేధించిన అండగా నిలిచినటువంటి తెలుగుదేశం పార్టీ లీగల్ సెల్‌కు రాష్ట్రంలోనూ జిల్లాలోనూ నియోజకవర్గంలోనూ మొదట ప్రాధాన్యత నామినేటెడ్ పదవులు లీగల్ సెల్‌కు కేటాయించాలని టీడీపీ నుంచి అందుతున్న విశ్వసనీయ సమాచారం. అందులో భాగంగానే జిల్లాలోనూ నియోజకవర్గంలోనూ కష్ట కాలంలో నిలిచినటువంటి లీగల్ సెల్‌కు మొదటి ప్రాధా న్యత నామినేటెడ్ పదవులు ఇవ్వాలని జిల్లా తెలుగుదేశం పార్టీ ఆలోచిస్తున్నట్లు అందుతున్న సమాచారం. వైసీపీ అరాచక పాలనలో గత 5 సంవత్సరములలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలే లక్ష్యంగా భౌతికంగా దాడులు అక్రమ కేసులు అలాగే ప్రశ్నించిన ప్రతి ఒక్క తెలుగుదేశం కార్యకర్త నాయకుడిని లక్ష్యంగా వారికి సంబంధించినటువంటి ఆస్తులు ధ్వంసం చేయడం భూకబ్జాలకు పాల్పడడం కొంతమంది అధికారులను అడ్డం పెట్టుకొని తప్పుడు నివేదికలు రాపించు తెలుగుదేశం పార్టీ నాయకులను కార్యకర్తలను తీవ్రంగా హింసించారు. అంతేకాకుండా గత తెలుగుదేశం ప్రభుత్వంలో చేపట్టినటువంటి పనులకు సంబంధించిన బిల్లులు నిలిపివేయడం తదితర విధాలుగా తీవ్రంగా గత వైసిపి ప్రభుత్వం చేపట్టింది. అటువంటి క్రమంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తకు నాయకుడుకు అండగా నిలుస్తూ తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు కార్యకర్తలకు అండగా నిలుస్తూ గత తెలుగుదేశం ప్రభుత్వంలో నిలిచినటువంటి పనులకు సంబంధించిన బిల్లులను ఇప్పించడంలో పార్టీ సొంత నిధులు వెచ్చించి లీగల్ సెల్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా న్యాయవాదులను ఏర్పాటు చేసి న్యాయస్థానం ద్వారా కార్యకర్తలకు నాయకులకు రావాల్సినటువంటి బిల్లులను ఇప్పించుటకు విశేష కృషి చేసిందని అదేవిధంగా రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో తెలుగుదేశం పార్టీ నాయకులపై కార్యకర్తలపై పెట్టినటువంటి అనేక అక్రమ కేసులను తెలుగుదేశం పార్టీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో న్యాయపోరాటం చేసి పార్టీని నమ్ముకున్నటువంటి కార్యకర్తలను నాయకులను కాపాడుకుంటూ అండగా నిలిచింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ప్రస్తుతం చేపడుతున్న నామినేటెడ్ పదవుల్లో కూడా లీగల్ సెల్ కు మొదట ప్రాధాన్యత కల్పించాలని ఆలోచనలో ఉన్నట్లు తెలుగుదేశం పార్టీ నుంచి అందుతున్న సమాచారం.

## రొట్టెల పండుగలో చిన్నపాటి ఘటనలు జరగకుండా..

# బందోబస్తు నిర్వహించాం



▶ డ్రోన్ కెమెరాలతో నిరంతరం పర్యవేక్షణ ▶ జిల్లా ఎస్పీ కృష్ణ కాంత్

**నెల్లూరు క్రైం, మేజర్‌న్యూస్ :** బారాషాహీద్ దర్గా, స్వర్ణాల చెరువులో అట్టహాసంగా జరిగిన ఐదు రోజుల రొట్టెల పండుగలో ఎలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా 2వేల మంది తో బందోబస్తును విజయవంతం చేశామని ఎస్పీ జి.కృష్ణకాంత్ తెలిపారు. రొట్టెల పండుగ నిఘా నీడలో అన్ని విభాగాలను సమన్వయం చేసు కుంటూ పోలీస్ సేవలను అందించడం జరిగిం దన్నారు. ముందుచూపుతో లక్షల మంది భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకొని ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేసిన డ్రోన్, సిసి టీవీ ఫుటేజిల ద్వారా బందో బస్తును అనుక్షణం పరిశీలిస్తూ, రద్దీకి అనుగు ణంగా సిబ్బందికి సూచనలు ఇవ్వడం జరిగింద న్నారు. షిఫ్ట్‌లకు అతీతంగా ఐదు రోజులు 24 గంటలు బేసిస్‌లో తమ సిబ్బంది సేవలు అందిం చారన్నారు. ప్రధాన దర్గా క్యూ లైన్లు, ఘాట్ ఏరి యా, బోటింగ్ పాయింట్, పార్కింగ్ ట్రాఫిక్ పాయింట్‌లను సమన్వయ పరుస్తూ, అన్ని సెక్టా ర్‌లలోని భక్తుల తాకిడిని పద్ధతి ప్రకారం నియం త్రణలో ఉంచుతూ సమర్ధవంతంగా బందోబస్తు నిర్వహించామని చెప్పారు. మానవతాదృక్పదం తో విధులు నిర్వహించి 472 మంది తప్పిపోయి న చిన్నారులను తల్లిదండ్రుల వద్దకు చేర్చడంతో పాటు వృద్ధులకు, దివ్యాంగులకు దర్గా దర్శనం, రొట్టెల మార్పిడికి అన్ని విధాల సహకరిస్తూ వారికీ దర్శనాలు సజావుగా జరిగేటట్లు చేశామ న్నారు. క్రైమ్ పోలీసులు 17పిక్ పాకెట్ సస్పె క్ట్‌లను అదుపులోకి తీసుకొని,విచారించి పంప గా, 12 పర్స్, నగదు, బట్టలతో ఉన్న బ్యాగ్ లను, ఛేధించి బాధితులకు అందజేయడం జరి గిందన్నారు. నేరాలను అరికట్టే క్రమంలో చేప ట్టిన ముందస్తు చర్యలపై సిబ్బందిని ఎస్పీ అభినందించారు. డైవర్షన్ పాయింట్స్, మేజర్, మైనర్ పార్కింగ్ ప్రదేశాలు, ట్రాఫిక్ జంక్షన్ పాయింట్స్, సాధారణ ట్రాఫిక్ రెగులేషన్ పాయింట్‌లలో సుమారు 8వేలకుపైగా యాత్రి కుల వాహనాలను ట్రాఫిక్ సమస్య లేకుండా పార్కింగ్ చేసినట్లు వెల్లడించారు. ప్రత్యేక పార్కిం గ్ ప్రదేశాలు ఏర్పాటుతో టాపిక్ సమస్య లేకుం డా చూసామన్నారు. ప్రముఖుల రాకపోకలు, అత్యవసర సేవలకు ఎటువంటి అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు. బాంబ్, డాగ్ స్క్వాడ్‌లతో యాంటీ సబోటేజ్ చెకింగ్, ఆర్‌ఒపి, లచే ముమ్మర తనిఖీలు చేస్తూ ప్రజలకు భరోసా కల్పించామన్నారు. ఓపిక, విచ క్షణ, సమయ పాలనతో బందోబస్తు విధులు నిర్వహించిన సిబ్బంది నుండి అధికారుల వరకు ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపారు.



గల్లీ గ్యాంగ్ స్టర్ మూవీ

## ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి జనసేన నాయకులు




**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు వాసి కొండిపోగు వెంకటేష్ దర్శకత్వంలో రూపొంది ఈనెల 26వ తేదీన రైన్, సిరీ థియేటర్స్‌లో విడుదల అవనున్న గల్లీ గ్యాంగ్ స్టర్స్ మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్ నెల్లూరు సినిమా అసోసియేషన్, ఇస్కాన్ సిటీ నందు ప్రముఖ మీడియా నిర్వాహ కుడు రెమో ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కళామతల్లి ముద్దుబిడ్డ అమరావతి కృష్ణారెడ్డి జనసేన నాయకులు గునుకుల కిషోర్‌తోపాటు పలువురు పాల్గొన్నారు. ఎంతో కష్ట పడి ప్రయాసలకు ఓర్చి ఈ సినిమా నిర్మాణం జరిగింది. డైరెక్టర్గా తనను తాను ప్రూవ్ చేసుకునేందుకు సహకరించిన నిర్మాతలకు, స్నేహి తులకు పేరుపేరునా అభినందనలు తెలియజేశారు. సినిమా ప్రోత్సాహానికై పలు వురు ఈ సినిమా కొన్ని షోల టికెట్లను కొనుగోలు చేసి టీంను ప్రోత్స హించారు. గునుకుల కిషోర్ మాట్లాడుతూ.. కృషితో నాస్తి దుర్భిక్షం కష్టపడి పనిచేస్తే ఫలితం తానంతట అదే వస్తుంది కష్టపడి ఈ సినిమాను రూపొందించిన నటీనటులకు అభినందనలు తెలుపుతూ ఈ సినిమా విజయవంతం అయిన తరువాత సక్సెస్ మీట్‌లో అందరం కలిసి వేడుక చేసుకోవాలి కళారంగం మీద అభిమానంతో ప్రతి ఒక్కరిని వెన్ను తట్టి ప్రోత్సహిస్తున్న అమరావతి కృష్ణారెడ్డిని ప్రశంశించారు. యువత స్వయం ఉపాధి కింద సినిమా రంగాన్ని కూడా ఎంచుకోవచ్చునని వారికి సహాయ కారిగా ఉంటూ అన్ని కళారంగాలకు ఆర్థికంగా సహాయం చేస్తూ వెన్నుద న్నగా నిలబడుతున్న అమరావతి కృష్ణారెడ్డి అభినందనీయులు వారు కోరి నట్లుగా చిన్న పరిశ్రమగా రిలీజ్‌కి అవంతరాలనూ, కళారంగం ఎదు ర్కొంటున్న సమస్యలను పెద్దలు వేములపాటి అజయ్‌కి తెలిపి సినిమా టోగ్రఫీ మంత్రివర్యులు జనసేన నాయకులు కందుల దుర్గేష్‌తో కలిసే విధంగా ఏర్పాటు చేస్తామని తెలిపారు కృష్ణ రెడ్డి మాట్లాడుతూ.. కళా రంగం అంటే తనకెంతో ఇష్టమని, కొంతమంది తాను రాజకీయంగా ఎదుగేందుకు కళారంగాన్ని ప్రోత్సహిస్తున్నారను కుంటారు కానీ తనకి రాజకీయం అంటే ఇంట్రెస్ట్ లేదు. 24కలలో కష్టపడుతున్న కళాకారులను ప్రోత్సహించడమే తన కాంక్ష అనీ చిన్న పరిశ్రమ ఎదుర్కొన్న సమస్యలను జనసేన నాయకులు ఇతర దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

## ఉదయగిరిని జిల్లా చేయాలని

# ముఖ్యమంత్రి చంద్రబాబుకు వినతి



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మెట్ట ప్రాంతమైన ఉదయగిరిని జిల్లా కేంద్రంగా చేయాలని శనివారం రాత్రి అమరావతిలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు ఉదయగిరి జిల్లా సాధన సమితి సభ్యులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు సాధన సమితి నాయకులు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం మా డిమాండ్‌ను పట్టించుకోకుండా జిల్లాల విభజనలో మా ప్రాంతానికి తీవ్ర అన్యాయం చేసిందన్నారు. దశాబ్దాలుగా ఏలాంటి అభివృద్ధికి నోచుకోక వనరుల లేమితో కొట్టుమిట్టాడుతున్న ఉదయగిరిని కేంద్రంగా పరిసర మెట్ట మండలాలను కలుపుకొని జిల్లా చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఉదయగిరిని జిల్లా చేస్తే కడప, ప్రకాశం, నెల్లూరు జిల్లాల వాసులకు ఎంతో అనుకూలంగా ఉంటుందన్నారు. అలాగే మౌలిక వసతుల కల్పన, వ్యవసాయ, విద్యా, వైద్యరంగాలు బాగుపడి వలసలు నివారించవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. తమ వినతికి ముఖ్యమంత్రి సాను కూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాధన సమితి నాయకులు డాక్టర్ వేణుగోపాల్, దస్తగిరిఅహ్మద్. గాజులపల్లి రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# క్రియాశీలక సభ్యత్వంతో ఎన్నో ఉపయోగాలు

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వంతో ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని జనసేన నెల్లూరు నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్ బాబు అన్నారు. ఆదివారం నగరంలోని 9వ డివిజన్‌లో ఆ డివిజన్ ఇన్‌చార్జ్ శ్రీకాంత్, స్థానిక నాయకులు మనోజ్‌ల ఆధ్వర్యంలో జనసేన క్రియాశీలక సభ్యత్వ నమోదు క్యాంపెయిన్ జరిగింది. ఈ కార్యక్రమానికి దుగ్గిశెట్టి సుజయ్ బాబు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సభ్యత్వ నమోదు కార్యక్రమం ఈనెల 18వ తేదీ నుంచి ప్రారంభమైందని, ఈ ప్రక్రియ ఈనెల 28వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. కార్యకర్తల కుటుంబాలకు భరోసా కల్పించాలనే ఉద్దేశ్యంతో అధిష్టానం ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. క్రియాశీలక సభ్యత్వం తీసుకున్న కార్యకర్తలకు 5లక్షల రూపాయల జీవిత బీమా, 50వేల రూపాయల ప్రమాద బీమా లభిస్తుందని



ఆయన తెలిపారు. క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమంలో కార్యకర్తలందరూ పాల్గొని సభ్యత్వం తీసుకోవాలని కోరారు. డివిజన్‌లో విశేష సంఖ్యలో యువత జనసేన సభ్యత్వం తీసుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సుందర్ రామిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్, జిల్లా కార్యదర్శి షేక్ ఆలియా, డివిజన్ ఇన్‌చార్జ్‌లు అజయ్, అనుదీప్, వెంకటేశ్వర్లు, చరణ్ పాల్గొన్నారు.

# ఎక్కడ చూసినా కల్తీ.. తూకల్లో మోసం !

**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** పండ్ల నుంచి కూరగాయల వరకు.. నిత్యవసరాల నుంచి ఆహార పదార్థాల వరకు కూల్ డ్రింక్స్, పెట్రోల్, డీజిల్ ఇలా ప్రతి వస్తువు విక్రయంలోను మండలంలో భారీగా మోసాలు చోటు చేసుకుంటున్నాయి. ఒకవైపు కల్తీ.. మరొకవైపు తూకాల మోసాలతో వినియోగదారులు నష్టపోతున్నారు. కొందరు వ్యాపారులు కనీస ప్రమాణాలు పాటించడం లేదు. మండల కేంద్రం నుంచి మారుమూల గ్రామీణ ప్రాంతాల వరకు కల్తీలు.. మోసాలు కొనసాగుతూనే ఉన్నాయి. నియంత్రించాల్సిన తూనికలు, కోలతల శాఖ, ఫుడ్ ఇన్స్పెక్టర్, సేవ్ టాక్స్ శాఖలు నిద్దర పోతున్నాయి. తూతూ మంత్రపు తనిఖీలు, కేసులతో సరిపెడుతుంది. తూనికలు, కొలతలు ఈ శాఖ ఒకటి ఉందని మండలంలో చాలామందికి తెలియదు. తూకాల్లో మోసం, వస్తువుల్లో కల్తీ నియంత్రణ ఆ శాఖ ప్రధాన విధి, మండలంలో షాపింగ్ మాల్ నుంచి గ్రామీణ ప్రాంతాల్లోని సంతల వరకు నిత్యం వారు తనిఖీలు చెయ్యాలి. తూకాల్లో మోసాలకు పాల్పడుతున్న వారిని గుర్తించి కేసులు నమోదు చేయాలి. కానీ మండలంలో ఇటువంటివి ఏమి కానరావడం లేదు. దీంతో వ్యాపారులు అక్రమార్జనకు అలవాటు పడిన వారు రెచ్చిపోతున్నారు. వినియోగదారులను నిలువునా మోసాలకు గురి చేస్తున్నారు. నిత్యవసరాలు, ఇతర ఆహార పదార్థాలు, పండ్ల తూకల్లో మోసాల సంగతి చెప్పనక్కర్లేదు, కిలో దగ్గర 200 గ్రాములు వరకు తగ్గించి అమ్ముతున్నారు. కొన్ని వస్తువులను ప్రామాణిక ముద్రతో విక్రయించాల్సి ఉన్నా ఇష్టారాజ్యంగా విక్రయిస్తున్నారు. ఇక సాధారణ తూనిక రాళ్లపై ఎటువంటి ముద్రలు ఉండవు. గ్రామీణ ప్రాంతాలలోనైతే వ్యాపారులు చెప్పిందే వేదం ఎవరైనా వినియోగదారుడు ప్రశ్నిస్తే అక్కడి వ్యాపారులంతా మూకుమ్మడిగా దాడులకు దిగుతున్న సంఘటనలు ఉంటున్నాయి. కూల్ డ్రింకుల విక్రయాల్లో భారీ దోపిడీకి తెరదీశారు. సాధారణంగా సీసాలపై ధర, తయారీ, మనుగడ వంటివి ముద్రించి ఉంటుంది. కానీ కొందరు వ్యాపారులు ధరను చెరిపేస్తున్నారు. అధిక ధరలకు విక్రయిస్తున్నారు. వ్యాపారులు సిండికేట్‌గా మారి నిలువు దోపిడీకి పాల్పడుతున్నారు. ధర వ్యత్యాసం గురించి ప్రశ్నిస్తే ఇష్టముంటే కొనండి లేకుంటే వెళ్లిపోండి అంటూ వ్యాపారులు తేల్చి చెబుతున్నారు. కానీ తూనికలు కొలతల శాఖ అధికారులు అటువైపుగా చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది.

# తిరుమలకు పాదయాత్రగా బయలుదేరిన టీడీపీ నాయకులు



**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత ఆనం రామ నారాయణ రెడ్డి ఆత్మకూరు ఎమ్మెల్యేగా తెలుగు దేశం పార్టీ తరఫున గెలుపొంది దేవాదాయ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన శుభ సందర్భంగా ఏఎస్ పేట మండలంలోని కొండమీద కొండూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు కార్యకర్తలు అభిమానులు గ్రామ ప్రజలు గ్రామం నుండి పాదయాత్రగా తిరుమలకు బయలుదేరి వెళ్లారు కొండమీద కొండూరు గ్రామంలోని లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయం నుండి తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం వరకు పాదయాత్రగా బయలుదేరినట్లు తెలిపారు గ్రామంలోని సుమారుగా 150 మంది జూలై 18వ తేదీ తెల్లవారుజామున నాలుగు గంటలకి పాదయాత్ర మొదలుపెట్టడం జరిగింది. ఈ పాదయాత్ర ఐదు రోజుల పాటు కొనసాగి ఐదవరోజు అనగా జూలై 22వ తేదీ తిరుమలకి చేరుకొని మొక్కులు చెల్లించుకుని స్వామివారి దర్శనం చేసుకోవడం జరుగుతుందని తెలిపారు. అలాగే మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఆత్మకూరు నియోజకవర్గం ఇంకా అన్ని విధాల అభివృద్ధి చెందాలని శ్రీ వెంకటేశ్వర స్వామిని వేడుకోనున్నట్లు తెలిపారు.



# శ్రీ వేదగిరి లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానము నందు ఉత్సవ మూర్తులకు అభిషేకం

**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ మండలం నరసింహకొండపై వెలసి ఉన్న శ్రీ వేదగిరి లక్ష్మి నరసింహస్వామి వారి దేవస్థానం నందు ఆదివారం పౌర్ణమి తిథి సంధర్భంగా ఉత్సవ మూర్తులకు అబిషేకం. గరుడసేవ గిరిప్రదక్షిణ ఉత్సవం కార్యక్రమాలు వేద పండితులు మంత్రోచ్చారణల మధ్య వైభవంగా జరిగాయి. ఉభయ కర్తలుగా పాటూరు డి.నరసింహరావు కుటుంబ సభ్యులు వ్యవహరించగా కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి వి.గిరికృష్ణ, అర్చక సిబ్బంది, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

# ఉచిత మెగా వైద్య శిబిరం



**బోగోలు, మేజర్‌న్యూస్ :** బోగోలు మండలం రామస్వామిపాలెంలోని శ్రీ విష్ణుశ్వర శ్రీరామలింగేశ్వర స్వామి దేవస్థానం శివాలయం ప్రాంగణంలో ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్, జైభీమ్ అంబేద్కర్ సేవాదళ్ ఆధ్వర్యంలో ప్రముఖ వైద్యులు బిందుమినన్ ఫౌండేషన్ డాక్టర్ బిందు మీనన్ వారి బృందంతో కలసి ఉచిత వైద్య వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఉచితం మందులు పంపిణీ చేయటం జరిగింది. ఇందులో భాగంగా బోగోలు మండలం విశ్వనాథరావుపేట గ్రామ సర్పంచ్ గండూరి మంజుల అంబేద్కర్ సేవాదళ్ అధ్యక్షులు బత్తుల రవిచంద్ర ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ డిస్టిక్ చీఫ్ దాసరి సునీల్ సెక్రటరీ ఎస్.కె నూరుద్దీన్ ఆఫీస్ సెక్రటరీ మల్లీ సురేష్ అరిజినల్ సెక్రటరీ దాసరి తిరుమల తదితరులు పాల్గొన్నారు. ఈ మెడికల్ క్యాంపులో పాల్గొన్న రోగులకు ఉచితంగా మందులను పంపిణీ చేసి ఆపరేషన్ అవసరమైన వారికి ఉచితంగా వైద్య సేవలు అందిస్తామని డాక్టర్ బిందు మేనని తెలిపారు.

# ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు



**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** అనంతసాగరం మండలంలోని వివిధ దేవాలయాల్లో ఆదివారం ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు జరిగాయి. మండలంలోని సోమశిల, అనంతసాగరం, రేవూరు తదితర గ్రామాల్లో సాయినాధునికి ప్రత్యేక పూజలు అలంకరణ చేశారు. రేవూరులో సాయినాధుడిని అలంకరంగా తీర్చిదిద్ది అభిషేకాలు హారతులు పట్టారు. గ్రామంలో స్వామివారిని రథోత్సవంలో ఊరేగించారు. భక్తులు ఉత్సాహంగా కోలాటం నిర్వహించారు. అనంతసాగరంలో టిడిపి పార్టీ అధ్యక్షురాలు మునగపాటి సునీత గురు పౌర్ణమి వేడుకల్లో పాల్గొన్నారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

# ఘనంగా అచ్చమాంబ పొంగళ్ళు

**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మర్రిపాడు మండలంలోని పొంగూరు మాలిచేలో వెలసిన అచ్చమాంబ ఆలయం వద్ద భక్తులు ఘనంగా ఆదివారం పొంగళ్ళు పొంగించారు. ఈ సందర్భంగా మహిళలు ఉపవాసాలు ఉండి పొంగలి పొంగించి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. కోరికలు తీర్చే కల్పవల్లిగా నెలకొన్న ఈ ఆలయం వద్దకు సుదూర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయం వద్దకు వచ్చినటువంటి భక్తులకు ఆలయ కమిటీ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది.

# మహిమలూరులో గురుపూర్ణిమ ఉత్సవాలు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మండలం మహిమలూరులోని శ్రీ షిరిడిసాయినాథుని ఆలయంలో ఆదివారం గురుపూర్ణిమ సందర్భంగా బెస్తసంఘీయులు ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. జగద్గురు వేదవ్యాసభగవానుని జయంతి గురుపూర్ణిమ అని బెస్తసంక్షేమసంఘ జిల్లా అధ్యక్షుడు పుట్టుబోయిన సుబ్బరాయుడు తెలిపారు. మహిమలూరులోని వ్యాసంతతి బెస్తకులబంధువులు గురుపూర్ణిమ పండుగను ఘనంగా నిర్వహించుకున్నామని ఆయన పేర్కొన్నారు. బెస్త సంఘీయులందరూ పాల్గొన్నారని సుబ్బరాయుడు పేర్కొన్నారు.

